క్లుప్తంగా

ఆసుపత్రికి గీజర్ అందజేత



ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వప్నకు గ్రీజర్‌ను అందజేస్తున్న రాజా

తుని: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గర్భిణుల కోసం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు తటవర్తి రాజా గీజర్ అందజేశారని సూపరింటెండెంట్ స్వప్న మంగళవారం తెలిపారు. ప్రసూతి విభాగంలో గర్భిణులు చల్లటి నీరు స్నానం చేయడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆమె తెలిపారు. దీంతో రాజా 15 లీటర్ల సామర్థ్యం గల గ్రీజర్‌ను ఉచితంగా అందజేశారు.

అపరాల సాగుతో అధిక లాభాలు

తుని రూరల్: రబీలో ఆరుతడి పంటగా అపరాల సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ విస్తరణ అధికారి పి.జగ్గ అప్పారావు అన్నారు. మంగళవారం తుని మండలం వల్లూరు, ఎస్.చామవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఏఈఓ మాట్లాడుతూ ఎకరానికి రూ.300 ప్రీమియం చెల్లిస్తే రూ.20 వేలు వరకు బీమా ప్రయోజనాలు లభిస్తాయన్నారు. ఈ నెల 15వ తేదీలోగా ప్రీమియం రైతులు చెల్లించాలన్నారు. అపరాల సాగులో మెళకువలు, సస్య రక్షణ చర్యలను ఆత్మ బీటీఎం బాబూరావు వివరించారు. వీఏఏ భవాని, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ విజేతగా డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు



రాష్ట్రస్థాయి వాలీబాల్ కప్‌తో విజేతలు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

తుని రూరల్: నవంబరు 28 నుంచి 30 వరకు పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని లోవకొత్తూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ కనిగిరి విశ్వేశ్వరరావు తెలిపారు. విజేతలను మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులు జరిగిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు గెలుపొందం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను అభినందించారు.

115 హెక్టార్లలో నేలకు ఒరిగిన వరిపంట

తుని రూరల్: ఫెంగల్ తుపాను ప్రభావంతో వీచిన ఈదురు గాలులు, వర్షాలకు మండలంలో 115 హెక్టార్లలో వరిపంట నేలకు ఒరిగిందని వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ మంగళవారం తెలిపారు. ఐదు ఎకరాల్లో వరి పనలు తడిచిపోయాయన్నారు. నేలకొరిగిన వరిపంటలను నిలబెట్టి కట్టలుగా కట్టాలని, తడిసిన వరి పనలపై ఉప్పునీటి ద్రావణం పిచికారీ చేస్తే రంగు మారవన్నారు. వర్షాభావం పూర్తిగా తగ్గిన తర్వాతే వరికోతలు చేపట్టాలని ఏఓ సూచించారు.

అతిథి అధ్యాపకుల నియమకానికి చర్యలు

తుని రూరల్: తుని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో కంప్యూటర్ సైన్సు బోధించేందుకు అతిథి అధ్యాపకులు నియమకానికి చర్యలు తీసుకున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో మాస్టర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్, సమాంతర సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఏపీ సెట్, ఎన్ఈటీ, పీహెచ్‌డీ పూర్తి చేసినవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల ఐదో తేదీన తగిన ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఇంటర్వ్యూ సమయంలో అభ్యర్థులు డెమో ఇవ్వాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు crcade partment@fdct uni.edu.inకు మెయిల్ బయోడేటాను పంపించాలన్నారు.

అస్సాగో పరిశ్రమకు వ్యతిరేకంగా నల్లజెండాలతో నిరసన

గోకవరం: గుమ్మళ్లదొడ్డి గ్రామంలో అస్సాగో పరిశ్రమకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో నల్లజెండాలతో శాంతియుత నిరసన చేపట్టారు. గ్రామంలో నల్లజెండాలతో నిరసన చేపట్టి పరిశ్రమను తరలించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనను ఎస్సై పవన్‌కుమార్ అడ్డుకున్నారు. సెక్షన్ 163, బీఎన్ఎస్ఎస్ అమలులో ఉన్నందున ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. ప్రతిరోజు గ్రామంలో గంట సేపు శాంతియుత నిరసనకు సహకరించాలని శివగణేష్ ఎస్సైకు విజ్ఞప్తి చేశారు. అలాగే సామాజిక నాయకుడు పాటంశెట్టి సూర్యచంద్ర సైతం గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సెక్షన్ 163, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ర్యాలీలు నిర్వహించడంపై శిగణేష్, సూర్యచంద్రతో పాటు మరో నలుగురిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

- 1.10 సెంట్ల భూమిలో పలు రకాల పంటలు
- సేంద్రియ సాగు, సొంతంగా అమ్మకం
- ఏడాదికి రూ.1.97 లక్షల ఆదాయం
- కష్టపడితే మంచి ఫలితాలు సాధ్యం



మామిడిలో విరగ కాసిన సపోటా చెట్టు



అంతర పంటగా సాగు చేసిన ఆకుకూరలు

తుని: పుడమిని నమ్ముకుంటే లక్ష్మి వరిస్తుందని రైతుల నమ్మకం. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా తునికి చెందిన రైతు గండి వెంకటరమణను చెప్పవచ్చు. జాతీయ రహదారిని ఆనుకుని 1.10 సెంట్లు భూమి ఉంది. ఇందులో ఎకరంలో మామిడి తోట ఉంది. 10 సెంట్లు భూమిలో బొప్పాయి సాగు చేశాడు. అంతర పంటగా ఆకుకూరలు వేశాడు. పంట వేసిన దగ్గర నుంచి అమ్మకం వరకు అన్ని అతనే చేస్తున్నాడు. ఏడాదికి రూ.1.97 లక్షలు నికర ఆదాయం తీస్తున్నాడు. ఇతనికి ఏడాది పొడవునా పంటల ద్వారా ఆదాయం లభిస్తుంది. సాగుకు సంబంధించిన అవలంబిస్తున్న పద్ధతులను ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

మామిడిలో అంతర సాగు

ఎకరా భూమిలో మామిడి తోట ఉంది. దీనికి నాలుగు వైపులా వేర్వేరు రకాల ఉద్యాన పంటలను వేశాడు. మునగ, అరటి, నిమ్మ, బత్తాయి, సపోటా, ఉసిరి, జామ, కరివేపాకు తదితర రకాలు సాగు చేశాడు. మామిడి తోటలో అన్ని రకాల చెట్లు ఉన్నాయి. బంగినపల్లి, సువర్ణరేఖ, రసాలు, తోతాపురి, నీలం, కోలంగోవ, హైదరసాహెబ్, పందూరి ఉన్నాయి. నీటి సదుపాయం ఉండడంతో సేంద్రియ ఎరువులను చెట్లకు వేస్తున్నాడు. మామిడితో పాటు ఇతర రకాల ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది.

బొప్పాయిలో అంతర పంటలు

బెంగళూరు నుంచి తీసుకువచ్చిన 100 బొప్పాయి మొక్కలను 10 సెంట్లలో సాగు చేశాడు. అంతర పంటగా కొత్తిమీర, చుక్కకూర, పాలకూర, మెంతు కూర, బంతిపువ్వులు, ఆనభ వేశాను. బొప్పాయికి పశువుల గెత్తం, వేప, గోమూత్రంతో తయారు చేసిన 4 లీటర్ల మిశ్రమాన్ని పిచికారీ చేశాను. విత్తనం నుంచి సస్యరక్షణ వరకు రూ.15 వేలు పెట్టుబడి పెట్టాను. బొప్పాయి అమ్మకం ద్వారా రూ.లక్ష, ఆకుకూరలు 6 నెలలకు రూ.20 వేలు, మునగ రూ.10 వేలు, అరటి రూ.12వేలు, సోపోటా, ఉసిరి, నిమ్మ రూ.5వేలు ఆదాయం వచ్చింది. మామిడి తోట ద్వారా రూ.50 వేలు ఆదాయం వస్తుంది.

సొంతంగా సేద్యం

కూలీలను పెట్టకుండా సొంతంగా పనులు చేస్తున్నాను. బొప్పాయి మొక్కకు మొక్కకు మధ్య 6 అడుగుల దూరం ఉంచి మధ్యలో చిన్నపాటి సాళ్ల ఏర్పాటు చేసి అందులో ఆకుకూరలను వేశాను. వీటికి సేంద్రియ ఎరువును తయారు చేసి వేశాను. విత్తనాలను సొంతంగా తయారు చేసుకుని, మళ్లీ పంటకు వినియోగిస్తున్నాను. చేతిక వచ్చిన పంటను తుని మార్కెట్‌యార్డులో ఉన్న రైతు బజారుకు తీసుకు వెళ్లి అమ్ముతున్నాను. 365 రోజులు మార్కెట్‌కు ఆకుకూరలను తీసుకువెళ్లి అమ్మి డబ్బులు సంపాదిస్తున్నాను.



విరగ కాసిన మునగ చెట్టు

సాగు చేయడం ఆనందం



ఉన్న కొద్ది భూమిలో రకరకాల పంటల సాగు చేయడం ఆనందంగా ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం తీస్తున్నాను. మామిడి నుంచి ఆకుకూరల వరకు పెట్టుబడి పోను రూ.1.97 లక్షల ఆదాయం వస్తుంది. ఉదయం కూరలు అమ్మడం, సాయంత్రం వ్యవసాయ పని చేస్తున్నాను. కూలీలను పెట్టాల్సిన అవసరం లేదు. చీడపీడలు వచ్చినప్పుడు ఉద్యానశాఖ అధికారి సూచనలు తీసుకుంటున్నాను. పంట నుంచి వస్తున్న ఆదాయంతో కుటుంబం ఆనందంగా ఉంటున్నాం.

–గండి వెంకట రమణ,రైతు

ఐలాజ్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి



సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బుగతా శివ, న్యాయవాదులు

ఏలేశ్వరం: ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్(ఐలాజ్) రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఐలాజ్ కన్వీనర్ బుగతా శివ కోరారు. పట్టణంలో మంగళవారం ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శివ మాట్లాడుతూ ఈనెల 8న అన్నవరం దేవస్థానంలోని శేషాద్రి సదన్‌లో నిర్వహించే ఐలాజ్ మొదటి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ సభకు ఐలాజ్ జాతీయ ప్రధానకార్యదర్శి క్లిఫ్టన్ డి.రొజారియో ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. న్యాయవాదులు, ప్రజల హక్కులను కాపాడడంలో ఐలాజ్ ముందు ఉంటుందన్నారు. అనంతరం సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అవసరాల దేవి, జోగా ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా ఒనుములమ్మ జాతర



ఒనుములమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్: డి.పోలవరం గ్రామదేవత ఒనుములమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవం జరిగాయి. రెండేళ్లకొకసారి రెండు రోజులు నిర్వహించే జాతరోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయ కమిటీ, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉత్సవాలు, తీర్థం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి, మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలను పురష్కరించుకుని కమిటీల ఆధ్వర్యంలో తీర్థం, దాండియా, కేరళ డ్యాన్స్, వాయిద్యాలు, శక్తి వేషాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, కోలాటం, డ్యాన్స్ హంగామా తదితర సాంఘిక కార్యక్రమాలు ప్రదర్శించారు. బాణసంచా పేలుళ్లు, విద్యుత్ దీపాలంకరణ చేశారు. గ్రామదేవత కావడంతో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న బంధువులు, ఆడపడుచులు, అల్లుళ్లు, స్నేహితులు గ్రామానికి చేరుకుని ఉత్సవాల్లో హడావుడి చేశారు. రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోలాహలంగా ముద్రగడ నివాసం



ముద్రగడ, గిరిబాబును కలిసిన అభిమానులు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం తనయుడు ముద్రగడ గిరిబాబుకు జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌చార్జిగా ప్రకటిస్తు పార్టీ కార్యాలయం నుంచి సమాచారం అందడంతో ఆయన నివాసం జనంతో కోలహలంగా మారింది. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ముద్రగడ నివాసానికి చేరుకుని యువనాయకుడు గిరిబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ముద్రగడ అభిమానులు భారీ స్థాయిలో తరలిరావడంతో ఆయన నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. గిరిబాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కిర్లంపూడిలోని ముద్రగడ అభిమానులు భారీ భాణసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఏనుగు వీధి సెంటర్‌లో గిరిబాబుతో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

కనకదుర్గమ్మకు చండీ హోమం



కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం 'మూల' సందర్భంగా మంగళవారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఉదయం తొమ్మిది గంటలకు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. తరువాత అమ్మవారికి వేదపండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. తరువాత వాటిని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు. ఐదుగురు భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, అర్చకులు చిట్టెం గోపి, వ్రతపురోహితులు చెళ్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: లారీ ఓనర్స్అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని పట్టణంలో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక లారీ ఓనర్స్ కల్చలర్ అసోసియేషన్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు జ్యోతుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా వాకాడ కనకరాజు, కార్యదర్శి గొర్లె శివ, సహాయ కార్యదర్శి అట్టాడ ఆనందరావు, కోశాధికారి వడ్డాణపు లోవరాజులను వైఎస్సార్ సీపీ నేతలు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. వీరికి శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించి కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కోరాడప్రసాద్, కావలి శ్రీను, చందక కిరణ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

భజన గురువులకు సన్మానం

గండేపల్లి: మల్లేపల్లిలో భజన గురువులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్తికమాసం నెల రోజులపాటు గ్రామంలో తెల్లవారు జామున భక్తిగీతాలతో భజన బృందం సభ్యులతోపాటు గ్రామస్తులు నగర సంకీర్తనలు చేశారు. ఇందుకు సహకరించిన భజన గురువులు వల్లభశెట్టి బుజ్జి, రామకుర్తి చిన బాబు, తెలగారెడ్డి శ్రీనివాస్, భజన బృందాన్ని సన్మానించినట్టు గ్రామస్తులు తెలిపారు. కంచర్ల వెంకటేశులు, తెలగారెడ్డి భద్రరావు, వలబశెట్టి ఆదినారాయణ, వంశీ, బుజ్జి, ఆక్కిరెడ్డి బాలాజీ, దార్లంక నూకరాజు, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

ప్రత్తిపాడు: నీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం సూర్య ప్రభ కోరారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు ఆవరణలో మంగళవారం ఎన్నికల సిబ్బందికి నీటి సంఘాల ఎన్నికల నిర్వాహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కె పుణ్యవతి, నీటి పారుదలశాఖ ఏఈఈ ఎస్‌కే ఇబ్రహీం, పుష్కర ఇరిగేషన్ ఏఈఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ గీతాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రాజబాబు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏంఈఓలు జోసెఫ్, చిన్నారావు



కోటనందూరులో దివ్యాంగ చిన్నారికి బహుమతి అందిస్తున్న ఎంపీడీఓ వెంకటనారాయణ



జగ్గంపేటలో పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు



దివ్యాంగులకు బహుమతులు అందజేసిన ఎంఈవో షేక్‌బాజ్జి

- భవిత కేంద్రాల్లో వేడుకలు
- వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు

తుని రూరల్: మండల విద్యా వనరుల కేంద్రం (భవిత)లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం వేడుకగా నిర్వహించారు. మంగళవారం ఎంఈఓ పరవాడ గీతాదేవి ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం జరిగింది. దివ్యాంగులకు వివిధ పోటీలు నిర్వహించి, ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు సమకూర్చిన బహుమతులను అందజేశారు. ఎంఈఓ-2 రామకృష్ణ, ఐఈడీఎస్ఎస్ టీచర్ రామకొండబాబు, భవిత ఉపాధ్యాయులు రాంబాబు, శ్రీను, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరు: వైకల్యం ఉందని కృంగిపోకుండా దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. స్థానిక భవితకేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులకు నిర్వహించిన వివిధ క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామశేఖర్, సీఆర్పీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచదివ్యాంగులదినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి షేక్‌బాజ్జి మాట్లాడుతూ భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దివ్యాంగులకు క్విజ్, క్రీడలు తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఐఈఆర్టీ వలంటీర్లు జగన్నాథం, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: దివ్యాంగులపై ప్రతేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వి.రాజబాబు తల్లిదండ్రులకు సూచించారు. ధర్మవరంలో భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 అచ్చిరాజు, ఉపాధ్యాయులు కృష్ణ, యర్రయ్య, సీఆర్పీలు మల్లేష్, రాంజీ ప్రసాద్, గంగారావు, భాషా తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: స్థానిక ఎంపీపీఎస్ స్పెషల్ పాఠశాలలోని భవితా సెంటర్‌లో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏంఈఓలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు ముఖ్యఅథిదులుగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. అనంతరం పిల్లల చేత కేకు కట్ చేసి పంచారు. భవితా కేంద్రంలో పెట్టిన పలు అంశాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు గోపి, సూర్యకళ, వరలక్ష్మి, నూకరాజు తదితరులు ఉన్నారు.

గోకవరం: దాసరి వారి వీధిలోని భవిత స్కూల్‌లో మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐఈఆర్‌టీ రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓలు గౌరమ్మ, చిమ్మ రాజుదొర ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత గ్రామంలో దివ్యాంగ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాస్‌రావు, ఐఈడీఎస్ఎస్ సత్తిబాబు పాల్గొన్నారు.

గండేపల్లి: ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మల్లేపల్లిలోని భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలో నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాతి బుజ్జి, ఎంఈఓలు కెహెచ్ నాయక్, కె.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ బారి, బి లోవ కుమార్, ప్రకాశరావు, ఎస్ లక్ష్మణరావు, ఎస్.తాతబాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక స్త్రీ శక్తి భవనంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రం(భవిత సెంటర్), జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల టీవీఎస్ రంగారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగ్గంపేట ఎంపీడీఓ చంద్రశేఖర్, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ పాల్గొన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు ఆర్.స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, భవిత స్కూల్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మికి సత్కారం



రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న ఉద్దగిరి సోమరాజు

ఏలేశ్వరం: వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా బెస్ట్ ఎంప్లాయి అవార్డు అందుకున్న జి.రాజ్యలక్ష్మిని పట్టణంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక సీహెచ్‌సీలో ఐసీటీసీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మిని మండల పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు శాలువకప్పి సత్కరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శైలజ, దాకమర్రి లోవరాజు, కిరీటీ, గంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ఉచిత శిక్షణ

తుని: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐలో ఉచిత డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును ప్రారంభిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. పదో తరగతి ఆపైన విద్యార్హత కలిగి 19–35 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు, పురుషులు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు విద్యార్హత, ఆధార్ జెరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు స్కిల్ హబ్ సెంటర్ కో ఆర్డనేటర్ కె.నరేంద్ర 9640138565 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో అపరాల పంపిణీ



అల్లిపూడిలో వరిసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: మండలంలో రైతు సేవా కేంద్రాల్లో అపరాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాదికారి చంద్రశేఖర్ అన్నారు. అల్లిపూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.అనంతరం రైతులకు ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా వచ్చిన మినుముల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఏఈఓలు శివకుమారి, సురేష్, వీఏఏ రేణుక పాల్గొన్నారు.

ఘనంగా బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి

జగ్గంపేట: భారతదేశ మొట్టమొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని జగ్గంపేటలో డీఎస్‌టీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు విచ్చేశారు. రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు మండపాక అప్పన్నదొర,ఉపాధ్యాయులు,స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గండేపల్లి: సూరంపాలెంలో మంగళవారం సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై యూవీ శివనాగబాబు గ్రామస్తులకు చోరీలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రయాణాలలో జాగ్రత్తలు పాటించాలని, సెల్‌ఫోన్‌కు వచ్చే తెలియని సమాచారాలు ఓపెన్ చేయకూడదని, డిజిటల్ అరెస్టులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పోతుల మోహన్‌రావు, గ్రామస్తులు గళ్ల కృష్ణ మాదవ, కుంచే రామకృష్ణ, పోశ్ని బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 17మంది అరెస్టు

జగ్గంపేట: స్థానిక సర్కిల్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 17 మందిని అరెస్టు చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరు పరచగా 13 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా, ముగ్గురికి 7 రోజులపాటు, ఒకరికి రెండు రోజులు జైలు శిక్షను విధించారని తెలిపారు. వారిని సబ్‌జైలుకు తరలించామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

శంఖవరం: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని కత్తిపూడి, అన్నవరం, రౌతులపూడి రహదారుల్లో ఆయన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 12 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.42 వేలు అపరాద రుసుం విధించారు. తనిఖీల్లో ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

అన్నవరం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తనయుడు, పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ముద్రగడ గిరితో కలిసి గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్టు ఆ పార్టీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు తెలిపారు. మంగళవారం ఆయన అన్నవరంలో విలేకరులతో మాట్లాడారు. ముద్రగడ గిరికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలో వారిని స్వయంగా కలిసి అభినందించనున్నట్టు తెలిపారు. గిరి నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు అందరూ కృషి చేయాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు.

దడాల సతీష్ కుమార్తెకు పరామర్శ

ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న స్థానిక ఎంపీటీసీ దడాల సతీష్ కుమార్తెను ముదునూరి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అన్నవరం ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, తాటిపాక కృష్ణ, తాడి సత్యనారాయణ, పంచాయితీ సభ్యుడు కొల్లు చిన్నా తదితరులు పాల్గొన్నారు.